క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



ఆర్టీసీ డిపో వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న యూనియన్ నాయకులు

విజయనగరం టౌన్: ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీపీటీడీ స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.రాములు కోరారు. ఈ మేరకు డిపో ఆవరణలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులకు రావాల్సిన ఎనిమిది నెలల పీఆర్సీ బకాయిలు తక్షణమే చెల్లించాలని.. ఆర్టీసీ డిస్పెన్సరీ సిక్‌లపై జీతమివ్వాలని డిమాండ్ చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఉద్యోగులకు లీవ్ మంజూరు చేయాలన్నారు. సర్క్యులర్ ప్రకారం మహిళా ఉద్యోగులకు మూడు రోజుల సెలవు కేటాయించాలని కోరారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్‌వీ రావు, ఎ.చంద్రయ్య, కుమార్, ఎస్‌బీ నాయుడు, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'జగనన్న సురక్ష'

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆరు సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించనున్నట్లు కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10,11,12 సచివాలయాలకు సంబంధించి మహారాణిపేట సచివాలయంలో.. 13,14,15 సచివాలయాలకు సంబంధించి అంబటిసత్రం సచివాలయం పరిధిలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

వైకుంఠ నారాయణుడికి ప్రత్యేక అభిషేకాలు



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం రామనారాయణంలో వైకుంఠ నారాయణుడికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయం అర్చకులు చాణిక్య, శ్రీహర్ష ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత వైకుంఠ నారాయణుడికి వేదమంత్రాల నడుమ స్నపనం, అర్చన, పంచామృతాభిషేకాలు చేపట్టారు. ఉత్సవంలో ఎన్‌సీఎస్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు, మేనేజర్లు శ్రీనివాసరాజు, ఎంవీ రమణ, భక్తులు పాల్గొన్నారు.

శ్రీనివాసునికి పంచామృతాభిషేకాలు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్‌లో కొలువై ఉన్న శ్రీ అష్టలక్ష్మీ సమేత ఐశ్వర్య వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాసునికి గురువారం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని దేవాలయ అర్చకులు చామర్తి శ్రీనివాస రమేష్ ఆచార్యులు, చామర్తి రమేష్ ఆచార్యులు సంయుక్తంగా వేదమంత్రాల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవంలో దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు అడుగుజాడల్లో నడవాలి

విజయనగరం టౌన్: యావత్ ప్రపంచానికి క్రీస్తు శాంతి సందేశం అందించారని, ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని దైవ సందేశకులు, రెవరెండ్ ప్రవీణ్ థామస్ (విశాఖ) అన్నారు. అంబటిసత్రం వద్దనున్న ఏసు ప్రేమాలయం చర్చిలో ఇండియన్ క్రిస్టియన్ డే ముగింపు ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీస్తు అందించిన శాంతి సందేశాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. హెచ్చుతగ్గుల్లేని మానవ సమాజాన్ని క్రీస్తు కాంక్షించారన్నారు. క్రీస్తు బోధనలు పాటించిన వారే నిజమైన క్రీస్తు ఆరాధకులుగా గుర్తింపబడతారని చెప్పారు. చర్చి పాస్టర్ రవి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రెవరెండ్ కె.వరప్రసాద్, సంతోష్, ఇజ్రాయిల్, విక్టర్ బాబు, కోరాడ నాగేశ్వరరావు, ఎస్.కె.చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీలు భర్తీ చేయాలి

విజయనగరం అర్బన్: పోలీస్ శాఖలోని ఖాళీల భర్తీకి చేపట్టిన నియామక పరీక్షలను పూర్తిచేయాలని ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. కార్యక్రమంలో బి.వాసు, కోట అప్పన్న, ఎస్.సునీల్, నీలబోను, నాగభూషణం, బి.సుమన్ గణేష్, బి.చిన్నారావు, తదితరులు పాల్గొన్నారు.

విజయసాగర దుర్గమ్మ జాతరకు సర్వం సిద్ధం

విజయనగరం టౌన్: విజయసాగర దుర్గమ్మ తల్లి జాతర మహోత్సవాలకు సర్వం సిద్ధం చేసినట్లు హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ ప్రతినిధులు దవడ కొండబాబు, దవడ మీనా, స్రవంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పెద్దచెరువు గట్టుపై వెలిసిన విజయసాగర దుర్గమ్మ తల్లికి ఆషాఢం పూజా కార్యక్రమాలు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు లక్ష్మీనారాయణుల కల్యాణపు పందిరిరాట , 8వ తేదీ సాయంత్రం 6 గంటలకు లక్ష్మీనారాయణుల (వేప,రావిచెట్లు) కల్యాణం చేపడతామన్నారు. 9వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు కోట వద్ద నుంచి పెద్దచెరువు ఒడ్డున ఉన్న విజయసాగర దుర్గమ్మతల్లికి ఏడు ఎడ్ల బళ్లతో ఆషాఢం సారె సమర్పించనున్నామన్నారు.

జగనన్న సురక్షతో ఉచిత సేవలు

● ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



విజయనగరం రూరల్: రాకోడులో ఆర్జీదారునికి ధ్రువపత్రం అందిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు, తదితరులు

విజయనగరం రూరల్: 'ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమలేకుండా ప్రజలకు వారి గ్రామాల్లోనే ఉచితంగా 11 రకాల ప్రభుత్వ సేవలు అందించడానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చారని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండలంలోని రాకోడు గ్రామంలో ఎంపీపీ అప్పలనాయుడు ఆధ్వర్యంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవినీతికి తావులేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పారదర్శకపాలన సాగిస్తున్నారన్నారు. అర్హులైన పేదలకు కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమపథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని దేశంలోనే మొదటిసారిగా గ్రామ సచివాలయ వ్యవస్థతో తీసుకువచ్చారని కొనియాడారు. గ్రామ వలంటీర్ల వ్యవస్థతో ఇంటింటికీ ప్రభుత్వ సేవలు అందిస్తున్నారన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి, రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు మద్దతు అందించాలన్నారు. అనంతరం లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, సర్పంచ్ పాటిపిరెడ్డి వెంకటరమణ, ఎంపీడీఓ గంటా వెంకటరావు, పంచాయతీ కార్యదర్శి భాగ్యరాజ్, మండలశాఖ అధికారులు, పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గుంకలాంలో...

మండలంలోని గుంకలాంలో సర్పంచ్ కునుకు వెంకటరావు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు మాట్లాడుతూ, జగనన్న సురక్ష కార్యక్రమంలో కుల, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్స్ సర్టిఫికెట్, కౌలురైతుల రుణ అర్హత పత్రం, జనన, మరణ ధ్రువీకరణపత్రాలు, మ్యూటేషన్, టైటిల్ డీడ్, వివాహ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కు మొబైల్ అనుసంధానం, రేషన్ కార్డులో చేర్పులు, మార్పులు చేపడతారన్నారు. అనంతరం సర్పంచ్ వెంకటరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ నడిపేన శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆర్జీదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

పూసపాటిరేగ: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జి.రామారావు అన్నారు. మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు మహంతి జనార్దనరావుతో కలసి సుమారు 650 ధ్రువపత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రామారావు మాట్లాడుతూ, అర్హత ఉన్న వారందరికి సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా, అవసరమైన ప్రభుత్వ సేవలు అందించడానికి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ఏపీఓ రత్నమాల, సర్పంచ్ రౌతు శ్రీరామ్మూర్తి, కోరాడ మహేష్, రాజు, రౌతు నర్సింగరావు, రౌతు కొండ, తదితరులు పాల్గొన్నారు.

11 రకాల సేవలు

భోగాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రభుత్వం 11 రకాల సేవలను ప్రజలకు ఉచితంగా అందిస్తోందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని ఎ.రావివలస, చేపలకంచేరు గ్రామ సచివాలయాల్లో సర్పంచ్‌లు ఉప్పాడ శివారెడ్డి, అరజర్ల నరసింగరావు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. టీడీపీ నాయకులు చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవొద్దని, రాబోవు ఎన్నికల్లో మళ్లీ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. అనంతరం 769 మంది లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం చేపలకంచేరు గ్రామ సచివాలయంలో నిర్వహించిన మెడికల్ క్యాంపును పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నీలం అప్పలనాయుడు, ఈఓపీఆర్డీ సురేష్, ఏపీఓ ఆదిబాబు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవి, సీఎస్‌డీటీ మురళీ, నడుపూరి సత్యనారాయణ నాయుడు, డీబీ రెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం రూరల్: గుంకలాంలో ఆర్జీదారుకి ధ్రువపత్రం అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



భోగాపురం: లబ్ధిదారునికి ధ్రువపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, ఎంపీడీఓ అప్పలనాయుడు



పూసపాటిరేగ: లబ్ధిదారులకు ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ రామారావు, తదితరులు



నెల్లిమర్ల రూరల్ : నెల్లిమర్ల పట్టణంలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ సరోజిని, సాంబశివరావు, తదితరులు

అర్హులందరికీ సంక్షేమం

నెల్లిమర్ల రూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, పట్టణ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు అన్నారు. పట్టణంలోని మొయిద జంక్షన్‌లో గల ఒకటో వార్డు సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అర్హత ఉండి ఎవరికైనా పథకాలు రాకపోతే సురక్ష కార్యక్రమం ద్వారా అధికారులకు తెలియజేయాలన్నారు. అధికారులు పరిశీలించి పథకాలు అందించేందుకు చర్యలు తీసుకుంటారని చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు 11 రకాల 562 ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, నాగవంశం డైరెక్టర్ మద్దిల వాసు, కమిషనర్ బాలాజీ ప్రసాద్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సీఎం జగన్ విద్యా ప్రదాత

● మేయర్ విజయలక్ష్మి, ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి విద్యా ప్రదాత అని.. ప్రతి పేదవాడు విద్యావంతుడు కావాలన్న లక్ష్యంతో వివిధ పథకాలు అమలు చేస్తూ దేశచరిత్రలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టారని విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, మండల పరిషత్ అధ్యక్షుడు మామిడి అప్పలనాయుడు అన్నారు. అయ్యన్నపేటలోని ప్రాథమిక పాఠశాల వద్ద అమ్మఒడి పథకం కింద తల్లులకు నిధులు అందించే కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. దేశంలోనే ఆదర్శవంతంగా పేద విద్యార్థుల చదువుల కోసం అమ్మఒడి పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని చెప్పారు. నేరుగా తల్లుల ఖాతాల్లోకి నిధులు జమ కావడంతో దళారీల బెడద లేకుండా పోయిందన్నారు. నాడు – నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలను మార్చి ప్రతి బిడ్డా చదువుకోవాలన్న ఆశయంతో అనేక సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు మాట్లాడుతూ, పిల్లల ఉజ్వల భవిష్యత్‌ను తీర్చిదిద్దిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మధ్యాహ్న భోజనంలో అనేక మార్పులను తీసుకొచ్చి పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని చెప్పారు. కంటి వెలుగు, గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా కానుకలు అందిస్తూ నూతన విద్యా విధానానికి శ్రీకారం చుట్టారని అభివర్ణించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సైలాడ ఈశ్వరమ్మ, పిన్నింటి కళావతి, ఎంఈఓ రాజు, స్థానిక నాయకులు శైలాడ సత్యనారాయణ, లెంక మహేష్, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల తల్లులకు అమ్మఒడి చెక్ అందజేస్తున్న మేయర్, ఎంపీపీ, తదితరులు

వైఎస్సార్ జయంతి రేపు

విజయనగరం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ఈనెల 8వ తేదీన ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటలకు నగరంలోని వైఎస్సార్ సర్కిల్ (వెంకటలక్ష్మి కూడలి) వద్దనున్న దివంగత నేత విగ్రహానికి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఇతర ముఖ్య నేతలు పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. అలాగే నగరంతో పాటు మండలంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాల వద్ద స్థానిక నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

● కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు ఆదేశించారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో నగరంలోని 61 సచివాలయ కార్యదర్శులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే దోమల నియంత్రణపై దృష్టి సారించాలన్నారు. భారీ వర్షాలు కురిసే సమయంలో వరద నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకాలు లేకుండా కాలువలను శుభ్రంగా ఉంచాలన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండిపోయే ప్రాంతాల్లో ప్రత్యేక సిబ్బందితో అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అదేవిధంగా పారిశుధ్య నిర్వహణలో భాగంగా అమలు చేస్తున్న క్లాప్ కార్యక్రమానికి సంబంధించి ప్రజల నుంచి యూజర్ చార్జీలను వసూలు చేయాలన్నారు. అనంతరం సచివాలయాల వారీగా యూజర్ చార్జీల వసూళ్లపై ఆరా తీశారు. ప్రజారోగ్యాధికారి కొండపల్లి సాంబమూర్తి మాట్లాడుతూ, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ సురేష్‌బాబు జన్మదినం



బాబామెట్ట వెలుగు వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనం సరఫరా చేస్తున్న లక్ష్మణరావు, తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని మొయిద విజయరామపురంలో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్సీ సురేష్‌బాబు తిరుపతి పర్యటనలో ఉండడంతో జిల్లా వ్యాప్తంగా ఆయన అభిమానులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఫోన్ల ద్వారా పెద్ద ఎత్తున శుభాకాంక్షలు తెలియజేశారు. మొయిద గ్రామంలో స్థానిక యువత, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. విజయనగరం పట్టణంలోని ఎమ్మెల్సీ కార్యాలయంలో జన్మదిన వేడుకలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ విభాగం నేత దవళ లక్ష్మణరావు ఆధ్వర్యంలో బాబామెట్ట వెలుగు వృద్ధాశ్రమంలో మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేయడంతో పాటు ఆశ్రమానికి నెలకి సరిపడా నిత్యావసర సరుకుల అందజేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు ఖలీల్ షరీఫ్, చేయూత ఫౌండేషన్ అధ్యక్షుడు రాము, పత్తిగిడి శ్రీను, రామునాయుడు, రవివర్మ పాల్గొన్నారు.

టీడీపీకి నూకలు చెల్లాయి..

● బస్సు యాత్రకు ప్రజా స్పందన కరువు

● వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమళ్లు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమళ్లు

నెల్లిమర్ల రూరల్: టీడీపీకి నూకలు చెల్లాయని, మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభంజనంలో కొట్టుకుపోవడం ఖాయమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ అన్నారు. మండలంలోని గుషిణి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, టీడీపీ నిర్వహించిన బస్సుయాత్రకు ప్రజల నుంచే కాకుండా, సొంత పార్టీ నేతల నుంచి కూడా స్పందన కరువైందన్నారు. స్పందన రాకపోవడంతోనే ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. టీడీపీ హయాంలో నీరు – చెట్టు పేరిట కోట్లాది రూపాయల ప్రజాధనం లూటీ చేసిన విషయాన్ని ప్రజలు మరిచిపోలేదన్నారు. అధికార దాహంతో ఇచ్చిన హామీలను తుంగలోకి తొక్కి తీవ్ర ప్రజాగ్రహానికి గురైన చంద్రబాబు కొత్తగా ప్రజలకు మాయమాటలు చెబుతున్నాడని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు అవినీతిరహిత పరిపాలన అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, నేతలు జమ్ము అప్పలనాయుడు, చనమళ్లు చిన సత్యం పాల్గొన్నారు.


సామాన్యులకు తోడుగా 'జగనన్న సురక్ష'



గుషిణిలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న చనమళ్లు, గదల, తదితరులు

నెల్లిమర్ల రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం సామాన్యులకు తోడుగా నిలుస్తోందని డీసీసీబీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని కొండగుంపాం, గుషిణి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకురావడంతో ఇంటి వద్దే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఉచితంగా 11 రకాల ప్రభుత్వ సేవలు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించడంపై ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీలు సారిక వైకుంఠం, పతివాడ సత్యనారాయణ, సర్పంచ్‌లు జమ్ము సన్యాసమ్మ, పతివాడ అప్పన్న, ఎంపీటీసీ సభ్యురాలు చనమళ్ల స్వాతి, వ్యవసాయ సలహా మండలి చైర్మెన్ జమ్ము అప్పలనాయుడు, తహసీల్దార్ రమణరాజు, ఎంపీడీఓ గిరిబాల, ఈఓపీఆర్డీ భానోజీరావు, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు



విద్యార్థులకు అందజేయనున్న నోటుబుక్స్‌తో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: వీటీ అగ్రహారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పంపిణీ చేయనున్న నోట్ పుస్తకాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి గురువారం తన నివాసంలో ఆవిష్కరించారు. సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు చేయూత అందించే కార్యక్రమాలు ఏటా చేపడుతున్నామని సంఘ అధ్యక్షుడు మండవిల్లి వెంకటరాజు, కార్యదర్శి బోడపైడిశెట్టి తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి కె.శ్రీరామ్మూర్తి, సభ్యులు మానేపల్లి సత్యనారాయణ, బుడ్డెపు కృష్ణ, విన్నకోట సూర్యారావు, సత్యవరపు నారాయణమూర్తి, గ్రంధి కోటేశ్వరరావు, బొడ్డు కామేష్, బొండాడ నాగేశ్వరరావు, కట్టమూరి ఆంజనేయులు, శంకరరావు, ముప్పిడి అప్పలరాజు, కుసుమంచి నర్సింగరావు, సత్యనారాయణ, జగదీష్ పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు వైద్య పరీక్షలు తప్పనిసరి

● నగర మేయర్ విజయలక్ష్మి



విజయనగరం ఫోర్ట్: కార్యక్రమంలో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి



భోగాపురం: వెటర్నరీ క్లినిక్‌లో కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న పశువైద్య సహాయ సంచాలకుడు ఉమాశంకర్ మహాపాత్రో

విజయనగరం ఫోర్ట్: పెంపుడు జంతువులకు క్రమంతప్పకుండా వైద్య పరీక్షలు చేయించాలని మేయర్ వెంపడాపు విజయలక్ష్మి అన్నారు. అలాగే వాటి నుంచి వ్యాధులు సంక్రమించకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. జునోసిస్ డే సందర్భంగా గురువారం స్థానిక పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత రేబిస్ టీకాల కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మనికిష్టమైన జంతువుల నుంచి మనకు తెలియకుండానే రేబిస్, మెదడువాపు, బర్డ్‌ఫ్లూ, ఎబోలా, ప్లేగు, ఆంత్రాక్స్ వంటి అనేక రకాల వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో వాటికి వైద్యుల పర్యవేక్షణలో ఎప్పటికప్పుడు టీకాలు వేయించాలని సూచించారు. జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి ఎ. విశ్వేశరావు మాట్లాడుతూ, సంక్రమిత వ్యాధుల బారిన పడకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పెంపుడు జంతువులను కూడా పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. అనంతరం 284 పెంపుడు కుక్కలు, పిల్లులకు ఉచితంగా రేబిస్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయలక్ష్మి, డీడీ వైవీ రమణ, డాక్టర్ వీవీ భాస్కరరాజు, సహాయ సంచాలకుడు డాక్టర్ కేవీ రమణ, డాక్టర్ ధర్మారావు, డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ లలిత, డాక్టర్ మోహన్, డాక్టర్ అంజలి, తదితరులు పాల్గొన్నారు.

రేబిస్ టీకాలు..

భోగాపురం: ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా మండలంలోని భోగాపురం, ముంజేరు, పోలిపల్లి పశువైద్యశాలల్లో వైద్యాధికారులు 120 పెంపుడు జంతువులకు (కుక్కలు) రేబిస్ నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యశాఖ సహాయ సంచాలకుడు ఉమాశంకర్ మహాపాత్రో తెలిపారు. పెంపుడు జంతువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. జంతువులకు అనారోగ్యం సోకిన వెంటనే వైద్య చికిత్స అందించాలని సూచించారు. కార్యక్రమంలో పశువైద్యులు రామరాజు, కమలకుమారి, పశువైద్య సహాయ సంచాలకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయానికి టీకాలు వేయించేందుకు తీసుకువచ్చిన శునకాలు

బకాయిలు చెల్లించాలి

నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల జూట్‌మిల్లు యాజమాన్యం 2016 విశ్రాంత కార్మికులకు గ్రాడ్యూటీ బకాయిలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక జూట్‌మిల్లు సమీపంలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులకు రావాల్సిన పీఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించడంతో పాటు పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు.